

తీర్థాలలో పాలేరు ఎంఎల్ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు




మనం
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం-మహబూబాబాద్
ఆదివారం | 19 | ఫిబ్రవరి | 2023 | పేజీలు : 9


# హరహర మహాదేవ శంభో శంకర..





**మారుమోగిన శివనామస్మరణ**
**కిటకిటలాడిన శివాలయాలు**
**తీర్థాల, స్నానాల లక్ష్మీపురం, నీలాద్రిలో భక్తుల జాతర**
**తీర్థాలలో ఎంఎల్ఏ కందాల, కలెక్టర్, సీపీ ప్రత్యేక పూజలు**
**ఆర్‌టిసి ప్రత్యేక బస్సుల నిర్వహణ**

**ఖమ్మం, ఫిబ్రవరి 18(మనం బ్యూరో) :** మహాశివరాత్రి సందర్భంగా శివనామస్మరణ మారుమోగింది. భక్తులతో శివాలయాలు కిటకిటలాడాయి. ఖమ్మం రూరల్ మండలం తీర్థాల, వైరా మండలం స్నానాల లక్ష్మీపురం, పెనుబల్లి మండలం నీలాద్రిలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలు మాచరించారు. తెల్లవారుజామున నుండే భక్తులు పూజలు ప్రారంభించారు. తీర్థాలలో పాలేరు ఎంఎల్ఏ కందాళ ఉపేందర్‌రెడ్డి, కలెక్టర్ విపి గౌతమ్, సీపీ విష్ణు ఎస్ వారియర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఆర్‌టిసి ప్రత్యేకంగా బస్సులను నడిపింది. పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

## అధ్యయనం అవసరం

సాహితీ ప్రక్రియల విషయంలో వైషమ్యం వద్దు
సాహిత్యాభివృద్ధికి ప్రభుత్వ కృషి బాగుంది
పర్యావరణ వనరుల తరుగుదల, దోపిడీపై రచనలు పెరగాలి
ప్రముఖ కవి, రచయిత, కాళోజీ అవార్డు గ్రహీత ఆర్.సీతారాం


వివరాలు మెయిన్ 10లో..


## విద్య పట్ల పాలకుల దృక్పథం మారాలి



**ఉపాధి అవకాశాలు కల్పించాలి**
**మేథోవలసను తగ్గించే ప్రయత్నం జరగాలి**
**ప్రముఖ విద్యావేత్త, న్యూఇరా విద్యాసంస్థల అధినేత ఐవి రమణారావు**


వివరాలు2లో..




## పాలేరులో షర్మిళ పాదయాత్ర

**20న నియోజకవర్గంలోకి మరోమారు ప్రవేశం**
**మార్చి 5న కూసుమంచిలో ముగింపు**

**ఖమ్మం, ఫిబ్రవరి 18(మనం బ్యూరో) :** షర్మిళ పాదయాత్ర మరోమారు పాలేరు నియోజకవర్గంలో జరుగనుంది. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పాదయాత్ర మార్చి 5న కూసుమంచిలో ముగియనుంది. ఆదివారం మహబూబాబాద్ జిల్లాలో పాదయాత్ర జరుగనుంది. మహబూబాబాద్, డోర్నకల్ నియోజక వర్గాల్లో పాదయాత్ర ముగించుకొని తిరుమలాయపాలెం మండలం ఇస్లావత్ తాండా వద్ద పాలేరు నియోజక వర్గంలో అడుగు పెట్టనున్నారు. 14 రోజుల పాటు పాలేరు నియోజక వర్గంలో పాదయాత్ర కొనసాగనుంది. 2021 అక్టోబర్ 20 న ప్రారంభం అయిన ప్రజా ప్రస్థానం పాదయాత్ర ఏడాదిన్నర పాటు జరిగింది. ప్రజా సమస్యలు తెలుసుకుంటూ తెలంగాణ అంతటా సాగిన షర్మిళ ప్రజా ప్రస్థానం మార్చి 5న ముగియనుంది. గతంలో ఓసారి షర్మిళ పాలేరులో పాదయాత్ర చేపట్టారు. ఇది రెండోసారి.

### పాలేరు సమస్యలు తెలుసుకుంటూ...

రెండోసారి పాలేరులోకి అడుగుపెట్టనున్న షర్మిళ ఇక్కడి ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకోనున్నారు. ఇప్పటికే ఆమె పాలేరు నుండి పోటీ చేయడానికి ఆసక్తి కనబరిచారు. అందులో భాగంగానే క్యాంప్ కార్యాలయం నిర్మాణానికి ఇటీవలనే భూమి పూజ చేశారు. ఇటీవలనే తాత్కాలిక క్యాంప్ కార్యాలయాన్ని షర్మిళ తల్లి వైఎస్ విజయమ్మ ప్రారంభించారు. పాదయాత్ర అనంతరం షర్మిళ పాలేరుపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. షర్మిళ రాకతో మరోమారు పాలేరు రాజకీయాలు ఊపందుకోనున్నాయి.




**ఖమ్మం ఎడ్యుకేషన్, మనం న్యూస్ :** మార్కెట్‌లో సరుకుగా విద్య మారిపోయింది, ఈ పరిస్థితికి పాలకులే కారణమని, అందుకే విద్య పట్ల పాలకుల దృక్పథం మారాలని ప్రముఖ విద్యావేత్త, న్యూఇరా విద్యాసంస్థల ఐవి రమణారావు పేర్కొన్నారు. అవిభక్త ఖమ్మం జిల్లాలోని విద్యా సాహిత్య సాంస్కృతిక రంగాలకు సంబంధించిన ప్రగతి, ప్రస్తుత పరిస్థితుల గురించి ప్రజలకు అందించాలనే సత్సంకల్పంతో 'మనం దినపత్రిక 'ఆయా రంగాల మేథావులతో, విద్యావేత్తలతో, కవులు, రచయితలు, కళాకారులతో ఇంటర్వ్యూలు నిర్వహించి ప్రచురించాలని తలపెట్టింది..ఈ కార్యక్రమ నిర్వహణకు ప్రముఖ రచయిత, విద్యావేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణుడు అట్లూరి.వెంకటరమణను ఎంపిక చేసుకుంది.. దీనికి **'టాక్ విత్ అట్లూరి'**అనే శీర్షిక పెట్టటం జరిగింది. ఈ బృహత్తర ప్రయత్నాన్ని ఆదరించాలని కోరుకుంటూ... విద్యారంగం లోని వివిధ పరిస్థితుల గురించి ప్రముఖ విద్యావేత్త, సామాజిక,రాజకీయ విశ్లేషకుడు **ఐ.వి.రమణారావుతో ముఖాముఖి...**

# విద్య పట్ల పాలకుల దృక్పథం మారాలి



ఉపాధి అవకాశాలు కల్పించాలి
మేథోవలసను తగ్గించే ప్రయత్నం జరగాలి
ప్రముఖ విద్యావేత్త, న్యూఇరా విద్యా సంస్థల అధినేత ఐవి రమణారావు

**అట్లూరి: విద్యారంగాన్ని ఎలా నిర్వచిస్తారు...?**
**ఐ.వి.ఆర్:** విద్యారంగం ఈ 75 ఏళ్లలో ఒక్కో సమయంలో ఒకొక రకంగా మార్పు చెందుతూ వచ్చింది. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో అక్షరాస్యతను పెంచేందుకు విద్యను పబ్లిక్ రంగంలోనే ఉంచారు. కేంద్ర, రాష్ట్రాల బాధ్యతగా 14 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యనందించారు. విదేశాల సహాయంతో అనేక ఉన్నత విద్యాసంస్థలు వచ్చాయి. క్రమంగా పాలకుల అవసరాలతైనేమీ, దేశ అవసరాలనైతేనేమీ..అనేక మార్పులు వచ్చాయి. ప్రయివేట్ పాత్ర పెరిగింది. ఇది విద్యారంగంలోనూ వచ్చింది. పారిశ్రామికీకరణ వచ్చిన తర్వాత స్కిల్స్ ఉన్న వారు అవసరమయ్యాక ఆ మేరకు విద్యారంగంలో మార్పులొచ్చాయి. క్రమక్రమంగా విద్య మార్కెట్ వస్తువైంది. సామాజిక బాధ్యత అనుకునే స్థాయి నుండి కంపెనీ ప్రాడక్టా అనుకునే దశ వచ్చేసింది. నేడు విద్య మార్కెట్లో ఉంచబడ్డ వస్తువు. స్థాయిని బట్టి విద్యను కొనుగోలు చేస్తున్నారు.

**అట్లూరి:మేథోవలస వల్ల దీర్ఘకాలిక అనర్థాలు ఏమిటీ?**
**ఐ.వి.ఆర్:** దేశం నుండి విపరీతమైన మేథోవలస ఉంది. చదువుకు సంబంధించిన అవకాశాలు పై స్థాయిలో చాలా తక్కువగా ఉన్నాయి. విదేశాల్లో మెరుగైన అవకాశాలుండడంతో వలస పోతున్నారు. కరెన్సీ విలువ పడిపోవడంతో మెరుగైన చోటకు వెళ్లి ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు వెళ్తున్నారు. ప్రధానంగా సేవా రంగంలో మేధావులు వలస పోయిన వారు ఉన్నారు. కారణాలు సమీక్షించుకుంటే...దేశంలో నిరుద్యోగం ఎక్కువగా ఉండడం. ప్రభుత్వ విధానాల కారణంగా ఉద్యోగకల్పనాఅవకాశాలు లేకపోవడంతో మేథోవలస ఎక్కువగా ఉంటోంది. చైనాలాంటి దేశాలు తమ దేశాల నుండి వలస పోయిన వారిని తిరిగి రప్పించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. మన దేశంలో అలాంటి ప్రయత్నాలూ లేవు. నెహ్రూ కాలంలో కొంత ప్రయత్నం జరిగింది. ఇప్పుడా పరిస్థితి లేదు.

**అట్లూరి:** విద్యావ్యవస్థపై తల్లిదండ్రుల దృష్టి పథం ఎలా ఉంది...?
**ఐ.వి.ఆర్:** తల్లిదండ్రులు మూడు రకాలుగా ఉన్నారు. పిల్లలను స్కూల్కు పంపుతారు. ఏం చదువుతున్నారనేది, ఏం చెబుతున్నారనేది వారికి తెలియదు. వీరంతా ఒక రకం. విద్య ద్వారానే జీవితంతో ఉన్నత శిఖరాలు అధిరోహించగలం అనుకునే మధ్యతరగతి వర్గపు తల్లిదండ్రులు ఉన్నారు. వీరంతా విద్య ద్వారానే ఆర్థికంగా ఎదుగుతామని నమ్ముతారు. అదే పనిలో ఉంటారు. ప్రస్తుత సమాజంలో ఉత్పత్తిపైనే కాకుండా పంపిణీపైనే పాలకులు దృష్టి పెడుతున్నారు. దీని వల్ల అసమానతలు పెరుగుతున్నాయి. ఉత్పత్తి వనరులు సమానంగా పంపిణీ జరగాలి. ఇక మూడో రకం తల్లిదండ్రులు విద్యను నేర్పిస్తారు. తద్వారా పరిశ్రమలు పెట్టించి వాటిలో గ్రాడ్యుయేట్స్‌ని పని చేయించేలా ప్లాన్ చేస్తారు. అందుకు తగిన స్కిల్స్ నేర్పిస్తారు. ఇలా విద్య పట్ల భిన్నమైన అవసరాల రీత్యా భిన్నమైన దృక్పథాలను తల్లిదండ్రులు కలిగి ఉన్నారు.




**అట్లూరి: తరగతి గదిలో ఉపాధ్యాయుడు, విద్యార్థి పట్ల ఎలాంటి అనుబంధం ఉంది. ఇప్పటి వాస్తవ పరిస్థితులు ఏమిటి..?**
**ఐ.వి.ఆర్:** గురుశిష్యుల మధ్య ఉన్న అనుబంధాన్ని ఏ సంబంధాలతోనూ పోల్చలేరు. తల్లిదండ్రుల తరువాత ఎక్కువ అనుబంధం గురుశిష్యుల మధ్య ఉండేది..దాదాపు 50 ఏళ్ల పాటు ఈ అనుబంధం కొనసాగుతూ వచ్చింది. విద్య వ్యాపార వస్తువుగా మారిన తరువాత వినిమయ సంస్కృతి వచ్చింది. విద్యార్థి విద్యను కొంటున్నాడు. విద్యా సంస్థ విద్యను అమ్ముతోంది. ఉపాధ్యాయుడు వారధిగా మారిపోయాడు..ఒక విషమ పరిస్థితి నెలకొంది.
అట్లూరి: ఖమ్మం విద్యారంగం పరిస్థితి ఎలా ఉంది..?
ఐ.వి.ఆర్: తెలంగాణలో హైదరాబాద్ తర్వాత ఖమ్మం జిల్లా విద్యారంగంలో ముందుంది. క్వాలిటీ విద్య అందించాలనే విషయంలో ప్రభుత్వ, ప్రయివేట్ విభాగాల్లోనూ జిల్లా అగ్రభాగాన ఉంది. అయితే నాణ్యమైన ఉపాధ్యాయులు అవసరం ఉంది. ఇప్పుడు ద్వితీయ, తృతీయ శ్రేణిలో పాసైన వారు ఇప్పుడు టాప్ విద్యార్థులకు చదువు చెబుతున్న పరిస్థితి ఉంది. ఇది కూడా ఖమ్మంలో ఉంది. ప్రధానంగా ఎంప్లాయిమెంట్ స్కిల్స్ నేర్పే విషయంలో వెనుకబడి ఉంది. ఇన్ఫ్రాస్టక్చర్ విద్యనందించడంలో వెనుకబాటు ఉంది. ఇక్కడి రాజకీయ పరిస్థితులు శాంతియుతంగా ఉండడం వల్ల విద్యారంగం ముందంజలో ఉంది. అందుకే ఖమ్మం పట్టణానికి వస్తున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. అయితే ఉద్యోగాల కల్పన విషయంలో వెనుకబాటు ఉంది. ఇక్కడ చదువుకుని ఉద్యోగాల కోసం వెళ్లిన వారి సంఖ్య ఖమ్మం నుండి చాలా ఉంది. రాబోవు కాలంలో ఖమ్మంలో వృద్ధులే మిగిలిపోయే పరిస్థితి నెలకొంది.





**అట్లూరి: విద్యారంగ సమస్యల పరిష్కారానికి సూచనలు..?**
**ఐ.వి.ఆర్:** పాలకులకు చిత్తశుద్ధి ఉండాలి. ఉత్పత్తి వనరులలో సమానత్వం ఉండాలి. ఆదేశిక సూత్రాలను పకడ్బందీగా అమలు చేయాలి. వనరుల పంపకంలో మార్పు జరగాలి. ఆస్తిపరులు ఎంతో కొంత సమాజానికి ఇవ్వాలి. ఉపాధి అవకాశాలు పెంచాలి. ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ ఇవ్వాలి. విద్యార్థుల మధ్య అంతరాలు తగ్గించాలి.

టాక్ విత్ అట్లూరి



# అధ్యయనం అవసరం

- సాహితీ ప్రక్రియల విషయంలో వైషమ్యం వద్దు
- సాహిత్యాభివృద్ధికి ప్రభుత్వ కృషి బాగుంది
- పర్యావరణ వనరుల తరుగుదల, దోపిడీపై రచనలు పెరగాలి
- ప్రముఖ కవి, రచయిత, కాళోజీ అవార్డు గ్రహీత ఆర్.సీతారాం

**కవులకు, రచయితలకు అధ్యయనం బాగా అవసరమని, అప్పుడే ఆలోచనలు వృద్ధి చెందుతాయని ప్రముఖ కవి, రచయిత, కాళోజీ అవార్డు గ్రహీత సీతారాం పేర్కొన్నారు. తన సాహిత్య ప్రస్థానం, ప్రస్తుత సమాజంలో సాహిత్య పరిస్థితులు, సమాజ మార్పులు, నేర్చుకోదగిన అంశాలపై మనం దినపత్రికకు ఆయన ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు...**

**సాహితీ ప్రస్థానం ఎలా ప్రారంభమైంది..? స్ఫూర్తి ఎవరు?**

కొన్ని వైఫల్యాలు నేరంలోకి నెడతాయి..లేకుంటే సృజనవైపు మళ్లిస్తాయి. నిస్సహాయత ఏదైనా చేయాలనిపించేలా ప్రేరేపిస్తుంది. అలా చుట్టు ఉన్న సమాజ జీవితం, కుటుంబ పరిస్థితులు తదితర అంశాలు సాహిత్యంలోకి ప్రవేశించడానికి కారణమయ్యాయి. వైఫల్యాలు చేసే గాయాలను సాహిత్యం పూడ్చుతుంది. సాహిత్యం కొన్ని విషయాలను తెలియజేస్తుంది. నమ్మకాలను, భరోసాను కల్పిస్తుంది. అలా జీవితం, సాహిత్యం పరస్పర పూరకంగా నిలుస్తాయి. గురువులు, క్లాస్‌మేట్స్ ఇచ్చిన ప్రోత్సాహం, స్ఫూర్తితో సాహిత్యంలోకి ప్రవేశించాను.

**'రక్తస్పర్శ' కవితా సంకలనం రావడానికి నేపథ్యం ఏమిటి?**

అప్సర్, ప్రసేన్, నేను ముగ్గురం కలిసి రక్తస్పర్శ కవితా సంకలనం తీశాం. దీని వెనుక ఓ చిన్న కథ ఉంది. నేను చదివే ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాలలో కవితా రచన, పఠన పోటీలు జరిగాయి. సిద్ధారెడ్డి కళాశాలలో చదివే అప్సర్ రాసిన కవిత చాలా బాగా వచ్చింది. తనకు బహుమతి వస్తుందనుకున్నాను. కానీ ఫలితం వేరేలా వచ్చింది. ప్రతిభావంతుడైన అప్సర్‌కు బహుమతి రాలేదనే బాధ ఉండేది. ఇలా నేను అప్సర్, ప్రసేన్ కలుసుకున్నప్పుడల్లా అనుకునేవాళ్లం. అలా ముగ్గురం కలిసి కవితా సంకలనం తీయాలనే ఆలోచన వచ్చింది. ఇందుకు కొంతమంది మిత్రుల ఆర్థిక సహకారం తోడ్పాటు కావడంతో రక్తస్పర్శ పుస్తకం ప్రింట్ అయింది. తర్వాత పరిస్థితి మీకు తెలిసిందే. ముగ్గురం మంచి గుర్తింపు తెచ్చుకున్నాం.

**సమాజ మార్పుకు సాహిత్యం దోహదపడుతుందా...వాస్తవాలేంటి?**

గణంగాకాల రూపేణా మార్పును చెప్పలేము కాని వ్యక్తుల ప్రవర్తనలో, సంస్కార, చైతన్య పూరితమైన ఆలోచనలు కలగడంలో సాహిత్యం దోహదపడుతుంది. మార్పు కొట్టొచ్చినట్లు కనిపించకపోయినా ఒక కొత్త దారి ఏర్పరచుకోవాలనే ఆలోచనలు కలిగిస్తుంది. చైతన్యాన్ని పెంచుతుందనడంలో ఎలాంటి సందేహమూ లేదు.

**సాహిత్యాభివృద్ధికి ప్రభుత్వాల కృషి ఎలా ఉంది? గతం కంటే పెరిగిందా...తగ్గిందా..?**

సాహిత్యం ప్రాధాన్యత చాలా పెరిగింది. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ కవుల పట్ల కొంత ప్రాధాన్యత లేని మాట వాస్తవం. తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమం సాహిత్యం ప్రాధాన్యతను పెంచింది. కొంతమంది కవులు ప్రజాప్రతినిధులయ్యారు. తెలంగాణ ప్రభుత్వం మహనీయ కవులు కాళోజీ, దాశరథి పేరిట అవార్డులు అందచేస్తోంది. సాహిత్య అకాడమిని ఏర్పాటు చేసి సాహిత్యాభివృద్ధికి కృషి చేస్తోంది. తెలంగాణలో మరుగున పడిన కవుల రచనలను వెలుగులోకి తీసుకొస్తుంది. రావెళ్ల వెంకటరామారావు, హీరాలాల్ మోరియా, కౌముది లాంటి కవులను జిల్లాకు పరిమితం చేయకుండా వారి రచనలను రాష్ట్ర వ్యాప్తంగా పరిచయం చేయడం అభినందించదగిన పరిణామం. చరిత్రకారులు, పరిశోధకులు పెరిగారు. అలాగే కళాకారులకు ప్రతి నెలా స్థిరమైన ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. ఇలా సాహిత్యాభివృద్ధికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోంది.

**సాహిత్య ప్రక్రియల్లోని కథను కవిత డామినేట్ చేస్తుందంటున్నారు. ఎంతవరకు వాస్తవం?**

అదేమీ లేదు. సాహిత్యంలో కథకు ప్రాధాన్యత ఉంటుంది. కవిత చదివే పాఠకుల సంఖ్య నిర్దిష్టంగా లేదు. కానీ కథను కథను ఎక్కువ మంది చదువుతారు. పుస్తక ప్రదర్శనలో కథలు, నవల పుస్తకాలు అమ్ముడిపోతాయి. ఈ రెండు ప్రక్రియల వ్యాప్తికి అనేక సంస్థలు పాటుపడుతున్నాయి. కవి సంగమం, అక్షరాల తోవ, తెలంగాణ సాహితీ వంటి సంస్థల ద్వారా కవిత్వం పెరిగింది. అదే సందర్భంలో కథల ప్రాధాన్యతా పెరిగింది. ప్రక్రియల విషయాల్లో వైషమ్యం లేకుండా ఉంటే బాగుంటుంది. ప్రక్రియలు పరిపూరకాలు అనే అవగాహన తప్పనిసరిగా ఉండాలి.

**ఖమ్మం జిల్లాలో సాహిత్యం ఎలా ఉంది..?**

ఈ జిల్లాలో సాహిత్యం వెల్లివిరుస్తోంది. ముఖ్యంగా బాలసాహిత్యం బాగా వస్తోంది. ఉపాధ్యాయులు తాము పని చేసే చోట పిల్లలతో రాయించడం, పిల్లల కోసం వారే రాయడమూ చేస్తున్నారు. సాహితీ సంస్థలు కూడా బాలసాహిత్యాన్ని ప్రోత్సహిస్తున్నాయి. శిక్షణా శిబిరాలు నిర్వహిస్తూ కథ, కవిత, పద్యం రచనా మెళకువలు నేర్పిస్తున్నారు. ఒకప్పుడు ఖమ్మం వాళ్లు వేరే ప్రాంతాలకు వెళ్లి పురస్కారాలు అందుకునేవారు. ఇప్పుడు చాలా మంది ఖమ్మం వచ్చి పురస్కారాలు అందుకుంటున్నారు. అక్షరాలతోవ, వురిమళ్ల ఫౌండేషన్, మువ్వా రంగయ్య ఫౌండేషన్, సాహితీ మాణిక్యం, ఖమ్మం ఈస్తటిక్స్ అవార్డులు అందచేస్తున్నారు. ఎవరి స్థాయిలో వారు సాహిత్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారు. ఇది అభినందించదగిన విషయం. కరోనా సమయంలోనూ జూమ్ వేదికల ద్వారా కార్యక్రమాలు నడిచాయి. ఖమ్మం జాషువా సాహిత్య వేదిక అనేక కార్యక్రమాలు నిర్వహించింది. అలాగే ఖమ్మంలో మహిళా కవులు పెరిగారు. ఇది శుభపరిణామం.

**రచయితలకు, కవులకిచ్చే సందేశం...?**

అధ్యయనం పెరగాలి. అవగాహన పెంచుకోవాలి. పర్యావరణ వనరుల తరుగుదల, దోపిడీ, వనరుల వినియోగం తదితర అంశాలపై సాహిత్యం పెరగాలి.

**– ఖమ్మం, ఫిబ్రవరి 18 (మనం బ్యూరో) :**

## సంక్షిప్త సమాచారం...

### నేడు పాలడగు నాగయ్య సమగ్ర సాహిత్యం ఆవిష్కరణ సభ

అమరజీవి, ఖమ్మం జిల్లా వాసి పాలడగు నాగయ్య సమగ్ర సాహిత్యం ఆవిష్కరణ సభ ఖమ్మం మమత రోడ్‌లోని విన్‌ఫీల్డ్ హైస్కూల్‌లో సాయంత్రం ఆరు గంటలకు జరుగనుంది. జాషువా సాహిత్య వేదిక అధ్యక్షులు మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగే ఈ సభకు ముఖ్య అతిథులుగా డాక్టర్ మండల స్వామి, రవిమారుత్, సిహెచ్ ఆంజనేయులు, పాలడుగు సరోజినీ దేవి, వురిమళ్ల సునంద, గుండెపాక నర్సయ్య, మందా దేవేంద్ర ప్రసాద్ హాజరు కానున్నారని జాషువా సాహిత్య వేదిక కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.

### 20న కడివెడు పూలు, కథల తోట పుస్తకాల ఆవిష్కరణ

తిరుమలాయపాలెం మండలం జల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థుల కలం నుండి జాలువారిన కవితా సంకలనం కడివెడు పూలు, కథా సంకలనం కథల తోట పుస్తకాల ఆవిష్కరణ ఈ నెల 20న పాఠశాలలో ఉదయం 10 గంటలకు జరుగనుందని హెచ్‌ఎం కొమ్మవరపు కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథులుగా డిఇఓ సోమశేఖర శర్మ, ఎంఇఓ బాణాల రామాచారి, ప్రముఖ కవి మువ్వాశ్రీనివాసరావు తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. కథల పుస్తకాన్ని ప్రముఖ కథా రచయిత రాచమళ్ల ఉపేందర్, కవితల పుస్తకాన్ని ప్రముఖ కవి కోండ్రు బ్రహ్మం సమీక్షించనున్నారని తెలిపారు.

### 21న రెడ్‌బుక్ డేన శ్రీశ్రీ గీతాలాపన

ఈ నెల 21న రెడ్‌బుక్ డే సందర్భంగా మహాకవి శ్రీశ్రీ విగ్రహం వద్ద శ్రీశ్రీ గేయాల ఆలాపన ఉంటుందని నిర్వాహకులు మువ్వా శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. హార్వెస్ట్, రెజొనెన్స్, న్యూఇరా విద్యార్థులతో ఈ గేయాలాపన ఉంటుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## విశ్వనాథుని సర్వ కళా భూషణం...విశ్వనాథ్ సినిమా



సమాజంలో వేళ్లూనుకుపోయిన జాడ్యాలపై తన సినిమాలనే ఆయుధాలతో యుద్ధం చేసిన సర్వ సేనాని 'కళా తపస్వి' విశ్వనాథ్....మనుషుల్లో మాయమవుతున్న మానవీయతను, నైతిక విలువలు, సంస్కారాలను తిరిగి నిలబెట్టటమే పరమావధిగా సినిమాలు తీసిన దిగ్గజ దర్శకుడు...ఆయన ఏ సినిమా తీసుకున్నా ఒక్కటే లక్ష్యం కనబడుతుంది...అది మనుషులంతా ఒక్కటే అనే భావన...

**సప్తపది:** కుల వివక్షపై,వేళ్ళూనుకుపోయిన ఛాందస వాదంపై తన వ్యతిరేకతను దృశ్యరూపంలో దర్శింపజేసారు.

**స్వాతిముత్యం** : 59 వ ఆస్కార్ వేదికపై నిలిచి ప్రదర్శించబడిన అపురూప కళాఖండమిది..వితంతు వివాహాన్ని,లోకం పోకడ తెలియని ఒక అమాయక వ్యక్తితో జీవనయానాన్ని,సమాజంతో యుద్ధాన్ని తెలుపుతూ లోకం పోకడను ఎండగట్టిన చిత్రమిది..

**సిరివెన్నెల:** ఇద్దరు భిన్నమైన వికలాంగులతో అపురూప ఆవిష్కరణ చేసిన చిత్రమిది..కనులు లేని వేణువాద విద్వాంసుడిలోని ప్రతిభను,మాట్లాడలేని వ్యక్తిలోని కళాతృష్ణను హృద్యంగా చిత్రీకరించి సాధించటానికి ఏదీ అడ్డంకి కాదని తెలిపిన చిత్రమిది..

**శంకరాభరణం:** 43 సంవత్సరాల తరువాత కూడా ప్రపంచాన్ని విస్మయపరుస్తున్న చిత్రమిది..సంవత్సరాల తరబడి సినీ ప్రేక్షకుల చేత ఔరా అనిపించిన విశ్వనాథ్..మగవాడి దుశ్చర్యకు బలైన నృత్యకళాకారిణిలోని అసాధారణ ప్రతిభను గౌరవించి ఆదరించిన అపర సంగీత సరస్వతీ అవతారమైన శంకరశాస్త్రిని దైవంగా భావించి పూజించి అత్యాచార కారణంగా జనించిన కొడుకును ఆయన చెంతకు చేర్చి ఆయన ప్రతిరూపంగా మార్చటం అనే కథాంశం ఒక విప్లవం..శంకరుని మెడలోని త్రాచుపాము విషసర్పమైనా దానికి ఆ గౌరవం కలిగినట్లుగా పుట్టుక ఎటువంటిదైనా సన్మార్గంలో నడిపితే శంకరం వంటి అద్భుత శక్తి తయారవుతుందని సమాజానికి ఒక సందేశం ఇచ్చిన చిత్రం ఇది.

**స్వయం కృషి:** ఎంత ఎదిగినా తాను శ్రమించి నడచి వచ్చిన మూలాలను మరువకుండా చిన్నాను సన్మార్గంలో పెట్టడానికి అన్నీ వదులుకుని శ్రమ విలువ తెలిపిన సాంబయ్య పాత్ర ద్వారా శ్రమయేవ జయతే సూక్తిని లోకానికి అందించారు..

**స్వాతి కిరణం:** అసూయ,ద్వేషాలతో రగిలిపోయి శిష్యున్నే బలిగొన్న అహంకారైన గురువు పాత్ర ద్వారా గురువుకు ఏ లక్షణాలు ఉండకూడదో తెలిపిన చిత్రమిది.

**సాగరసంగమం:** ప్రపంచ సినిమాలో ఇలాంటి సినిమా తెరకెక్కటం నభూతో నభవిష్యతి..తల్లీ కొడుకుల బంధం,విలువలు మరువని స్నేహం,శిష్యురాలి మహోన్నత స్థాయికి తానే ఇరుసైన గురువు ఇన్నిటి సమాహారం సాగరసంగమం..

ఇలా చెప్పుకుంటూ వెళుతుంటే ఎన్నో..మరెన్నో వీటితో పాటు ఆపద్బాంధవుడు, సూత్రధారులు, శుభసంకల్పం, శుభోదయం వంటి సినిమాలోని విప్లవవాత్మక కథా వస్తువులు సమాజ గమనాన్ని సజీవంగా దర్శింపజేసిన నిలువెత్తు దర్పణాలు.. కుల,వర్ణ,మత,ఎక్కువ, తక్కువ వంటి చాంధస సంకెళ్ళను సమూలంగా త్రెంచటానికి ఆయన చేసిన ప్రయత్నం గొప్ప సంస్కరణవాదిగా ఆయనను నిలబెట్టాయి.. సినిమా కథలు ఒక ఎత్తు అయితే ఆయన సినిమాలలోని పాటలు మరో ఎత్తు...ఏమా సాహిత్యం..ఏమా పద గాంభీర్యం... ఆత్రేయ, ఆరుద్ర, కృష్ణశాస్త్రి, సినారె,వేటూరి,సిరివెన్నెల వంటి మహాకవులతో పాటలు రాయించు కున్న విశ్వనాథ్ వాటిని అపురూప దృశ్య ఖండికలుగా చేశారు.. ముఖ్యంగా విశ్వనాథ్,బాలు,సిరివెన్నెల త్రయం సృజించిన పాటల నిధి.. తెలుగు జాతికి శాశ్వత ఆస్తి. మరణం సహజం... మరణించిన తరువాత జీవించటం అతి కొద్ది మందికే సాధ్యం.. భారత సినిమా చరిత్రలో శాశ్వత అధ్యాయం...కళా తపస్వి విశ్వనాథ్.....తెలుగు సినిమాను ప్రపంచీకరణ చేసిన విశ్వనాథ్ జయంతి సందర్భంగా హృదయాంజలి...

**– అట్లూరి.వెంకటరమణ, 9550776152**

# శైవ క్షేత్రాలలో మారు మ్రోగిన హర హర మహాదేవ శంభో శంకర

**ఇల్లందు, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** ఇల్లందు పట్టణ గ్రామీణ ప్రాంతాలలో శనివారం శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శైవక్షేత్రాలలో తెల్లవారుజాము నుండి ప్రత్యేక పర్వదిన పూజ నిత్య ,దూప, దీప, కైకరియములు ఆలయాల అర్చకులు మొదలుపెట్టారు. ఇందులో భాగంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హర హర మహాదేవ శంభో శంకర పురవీధులు మారుమూగేలా నామస్మరణ చేశారు. ముఖ్యంగా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని చిన్న పెద్ద ముసలి ముతక అనే తేడా లేకుండా భక్తులందరూ జన సందోహంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం విశేషం పూజ అనంతరం భక్తులు శివరాత్రి రోజున ఒక్కపొద్దు ఉండి శివనామ స్మరణ జాగారం చేస్తూ అన్నపానీయాలు నిద్ర లేకుండా ఉండి శివనామ స్వరమే నిద్ర అన్నపానీయాలుగా భావించి మరుసటి రోజు తెల్లవారిన తరువాత శివ పూజ చేసిన అనంతరం శివరాత్రి జాగరణ పూర్తి చేసుకుంటారు. అందులో భాగంగా శనివారం శైవ క్షేత్రాలలో శివనామస్మరణలతో మారుమోగాయి ముఖ్యంగా ఇల్లందు పట్టణంలోని మెయిన్ రోడ్ శివాలయం వాగోడ్డు శివాలయం హరి హర క్షేత్రం కోటిలింగాల క్షేత్ర లలో భక్తులు పోటెత్తి శివ దర్శనం చేసుకొని హరిహర మహాదేవ శంభో శంకర శివ స్మరణ చేశారు.

**శివరాత్రి పర్వదినాన్ని ఎలా జరుపుకోవాలి. ఏ ఏ నియమనిష్టలతో నిర్వహించుకోవాలి :**

ఇల్లందు పట్టణ పరిధిలోని తాసిల్దార్ కార్యాలయం ప్రాంగణంలోని గణపతి ఆలయ అర్చకులు వేదాంతం శ్రీనివాసాచార్యులు వాగొడ్డు శివాలయ (పాత శివాలయం) అర్చకులు వేదాంతం లక్ష్మీ నరసింహ ఆచార్యులు శివరాత్రి పర్వదినాన్ని ఎలా నిర్వహించుకోవాలి నియమనిష్టలతో నిర్వహించుకోవాలి అనే విషయాలను మనం ప్రతినిధితో వారు వివరించారు. వారి వివరణలోసనాతన సంస్కృతిలో పండుగలంటే కేవలం విశ్రాంతి కోసమో, ఆహ్లాదం కోసమో ఉద్దేశించబడినవి కావు. ప్రతి సంబరంలోనూ ఆధ్యాత్మికత, దైవికత ఉంటుంది. ప్రతి పండుగకు వైజ్ఞానిక, ఆరోగ్య, శాస్త్రీయ కారణాలుంటాయి. అంతరిక్షం నుంచి ప్రసరించే కాస్మిక్ కిరణాలను, విద్యుత్ అయస్కాంత తరంగాలను దృష్టిలో ఉంచుకుని, ఏ రోజున ఏ పని చేయడం వలన మనిషి జీవనం వికసిస్తుందో, ఇంతకుముందు ఉన్న స్థితి నుంచి మరింత గొప్ప స్థితికి ఎదిగే అవకాశం లభిస్తుందో, గమనించి ఆయా రోజులలో ప్రత్యేక పర్వదినాలు ఏర్పరిచారు. మన మహర్షులు.శివరాత్రే యోగరాత్రి. శివరాత్రికి రోజు ప్రకృతిలో ఉండే తరంగాలు, అంతరిక్షం నుంచి వెలువడే కాస్మిక్ కిరణాలు విశ్వ మానవ వికాసానికి, మనిషి తన పరిపూర్ణమైన రూపాన్ని తెలుసుకోవడానికి, ఆత్మ సాక్షాత్కారానికి తోడ్పడుతాయి. అందుకే శివరాత్రికి కొన్నిప్రత్యేకనియమాలువిధించారు.

**1.ఉపవాసం.....**శివరాత్రికి చేసే ఉపవాసానికి, జాగరణకు విశేష ప్రాధాన్యం ఉంది. శివరాత్రి అందరూ ఉపవాసం చేయాలని శాస్త్రం చేయాలి. చిన్నపిల్లలకు, ముసలివాళ్ళకు, అనారోగ్యంతో బాధపడేవాళ్ళకు, గర్భవతులకు, ఔషధసేవనం చేయాల్సిన వాళ్ళకు మినహాయింపు ఇచ్చింది శాస్త్రం.ఉపవాసం ఉండే ముందు రోజు, ఉపవాసం మరుసటి రోజు మాంసాహారం, గుడ్డు మొదలైనవి తినకూడదు, మద్యపానం చేయకూడదు. ఎలాగూ ఉపవాసం చేస్తున్నాం కదా, ఉదయం లేస్తే ఆకలి తట్టుకోవడం కష్టమని, ఆలస్యంగా లేస్తారు కొందరు. అలా చేయకూడదు. ఉపవాసం ఉండేరోజు ఉదయం సూర్యోదయానికి ముందే నిద్రలేచి, తలపై నుంచి స్నానం చేసి, ఈ రోజు నేను శివునకు ప్రీతికరంగా శివరాత్రి ఉపవాసం చేస్తున్నాను అని సంకల్పం చెప్పుకోవాలి. ఉపవాసం అనే పదానికి అర్థం దగ్గరగా ఉండడం అని. భగవంతునికి మనసును, ఇంద్రియాలను దగ్గరగా జరపడమే ఉపవాసం. ఆరోగ్యపరంగా చూసినప్పుడు ఉపవాసం శరీరంలో ఉన్న విషపదార్థాలను తొలగించడంతో పాటు శరీరంలో ప్రాణశక్తిని, ఇంద్రియ నిగ్రహాన్ని పెంచుతుంది. మరీ నీళ్ళు కూడా తాగకుండా ఉపవసించమని ఎవరు చెప్పలేదు. అలా చేయకూడదు కూడా. ఎందుకంటే శరీరాన్ని కష్టపెడుతూ, భగవంతుని వైపు మనసును తిప్పడం కష్టం.జీవారాధాన.అట్లాగే మీరు ఉపవాసం ఉన్నప్పుడు ఎంత బియ్యం, ఇతర ఆహారపదార్థాలు మిగిలుతాయో, వాటిని ఆకలితో ఉన్న పేదలకు పంచాలి. అష్టమూర్తి తత్వంలో శివుడు లోకంలో జీవుల రూపంలో సంచరిస్తూ ఉంటాడు. అన్నార్తుల ఆకలిని తీర్చడం కూడా ఈశ్వరసేవయే అవుతుంది. అందుకే స్వామి వివేకానంద 'జీవారాధానే శివారాధాన' అన్నారు.

**ఉపవాస నియమాలు కూడా అవే చెప్తాయి.** శివరాత్రి రోజు ప్రకృతిలో ఉన్న శివశక్తిని శరీరం గ్రహించాలంటే, వెన్నును నిటారుగా పెట్టి కూర్చోవాలి. అంటే కూర్చునే సమయంలో ముందుకు వంగి కూర్చోవడం లాంటివి చేయకుండా, మీ వెన్నుపూస నిటారుగా ఉండేలా కూర్చోవాలి, నిలబడాలి. **మౌనవ్రతం....** శివరాత్రి రోజు చేసే మౌనవ్రతం చాలా అద్భుత ఫలితాలను ఇస్తుంది. మానసికప్రశాంతతను చేకూరుస్తుంది. మౌనం అనగానే నోరు మూసుకుని కూర్చోవడం అని భావించవద్దు. వ్రతంలోత్రి కరణములు(మనోవాక్కాయములు) ఏకం కావాలి. మనసును మౌనం ఆవరించినప్పుడు మౌనవ్రతం సంపూర్ణమవుతుంది. అందువల్ల అనవసరమైన ఆలోచనలను, వాదనలను కట్టిపెట్టి, మనసును శివుని పై కేంద్రీకరించాలి. అవసరమైతే శివాలయానికి వెళ్ళండి, అక్కడ రుద్రాభిషేకం చేస్తారు. రుద్రం ఒకసారి చదవటానికి అరగంటపడుతుంది .మీరుఅభిషేకంచేయించుకోకపోయిన పర్వాలేదు, శివాలయంలో ప్రశాంతంగా కళ్ళు మూసుకుని కూర్చుని, పండితులచే చదవబడుతున్న రుద్ర–నమకచమకాలను వినండి. ఆ తర్వాత వచ్చే ఫలితాలను చూడండి.ఉద్యోగస్తులు, ముఖ్యంగా ప్రైవేటు రంగంలో పని చేస్తున్నవారికి ఆ రోజు సెలవు ఉండకపోవచ్చు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు అదే పరిస్థితి ఎదురుకావచ్చు. మరి అలాంటప్పుడు ఏం చేయాలి? అవసరమైంతవరకే మాట్లాడండి, అనవసరమైన మాటలు కట్టిపెట్టండి. ఎవరితోను గొడవ పడకండి, తిట్టకండి. సాధ్యమైనంత తక్కువ మాట్లాడండి. ఇంటి వచ్చాక, కాళ్ళుచేతులు ముఖం శుభ్రపరుచుకుని, శివుడి ముందో, ఆలయంలోనో కాసేపు కన్నులు మూసుకుని మౌనంగా కూర్చోండి. అభిషేకం...శివుడు అభిషేక ప్రియుడు. శివుడికి కాసిన్ని నీరు పోసిన, సంతోషంతో పొంగిపోతాడు. శివరాత్రి నాడు అందరూ వర్ణ, లింగ, జాతి, కుల భేదం లేకుండా శివుడిని అర్చించడం వలన, అభిషేకించడం వలన సదాశివుని అనుగ్రహంతో జీవితానికి పట్టిన పీడ తొలగిపోతుంది.

**5.జాగరణ......**

శివరాత్రికి చేసే జాగరణ మనలో ఉన్న శివత్వాన్ని జాగృతం చేస్తుంది. జాగరణం మనలో ఉన్న శివుడిని జాగృతం చేస్తుంది, తమస్సును తొలగిస్తుంది. సినిమాలు చూస్తునో, పిచ్చి కబుర్లు చెప్పుకుంటూనో, కాలక్షేపం చేస్తూనో చేసే జాగరణకు అది జాగరణ అవ్వదు, కాలక్షేపం మాత్రమే అవుతుంది. అప్పుడు పుణ్యం రాకపోగా, ఆ సమయంలో మట్లాడిన చెడు మాటల వలన పాపం వస్తుంది. 6.మంత్ర జపం....శివరాత్రి మొత్తం శివనామంతో, ఓం నమః శివాయ అనే పంచాక్షరీ మహామంత్ర జపం/స్మరణతో జాగరణ మీలో నిక్షిప్తమై ఉన్న అనంతమైన శక్తిని జాగృతం చేస్తుంది. శివోహం అనే భావనను కలిగిస్తుంది.శివరాత్రి మరునాడు ఉదయం శివాలయాన్ని సందర్శించి, ప్రసాదం తీసుకుని, ఇంటికి వచ్చి భోజనం చేసి ఉపవాస వ్రతం ముంగించాలి. అందరూ గుర్తుపెట్టుకోవలసిన ముఖ్య విషయం, శివరాత్రి నాడు ఉపవాసం, జాగరణ చేసినవారు, తరువాతి రోజు రాత్రి వరకు నిద్రించకూడదు. అప్పుడే సంపూర్ణఫలం దక్కుంతుదని చెప్తారు.లింగోద్భవ సమయం 01-03-2022 మంగళవారం రాత్రి తెల్లవారితే బుధ వారం రాత్రి 12 గంటల 29 నిమిషాల 4 సెకెండ్ల నుండి 12 గంటల 31 నిమిషాల 59 సెకెండ్ల వరకు లింగోద్భవ కాలం.సర్వేశ్వరుడైన ఈశుడు లింగస్వరూపుడూ అందులోనూ తేజో లింగస్వరూపుడై అవతరించిన మరుక్షణంలోనే మానవాళికి గొప్ప సందేశాన్ని ఇచ్చాడని వివరించే ఈ కథా సందర్భం శివపురాణంతో పాటు ఇతర పురాణాలలో కూడా ప్రస్తావితమై ఉంది.ఒక్క శివలింగానికి కాసింత పూజను, అభిషేకాన్ని ఏ రోజు చేసినా పుణ్యఫలమే. అందులోనూ శివరాత్రి వేళ లింగోద్భవ సమయంగా చెప్పే సమయంలో ఇక అలాంటి పూజలు, అభిషేకాలు చేస్తే ఎంత గొప్ప పుణ్యఫలం ప్రాప్తిస్తుందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరమేముంటుందని పురాణజ్ఞులు, పండితులు అంతా అనేమాట వాస్తవమే.అసలు మనిషి దైవ సందేశాన్నందుకొని లోక యాత్రలో పుణ్య పురుషుడుగా మెలగాలన్నదే మన ఆర్షవాణి, సంప్రదాయ పర్వదినాల అవతరణలో అసలు విషయం. ఇక లింగోద్భవ సమయంలో శివుడిచ్చిన సందేశమేమిటి? ఆ భవుడికి, భవనాశనుడికి, శంకరుడికి నచ్చినది ఏది? అనే విషయం కూడా ఇక్కడ ప్రస్తావితమై కనిపిస్తుంది.పూర్వం ఓసారి బ్రహ్మకు, విష్ణువుకు తానుగొప్పంటే తాను గొప్పన్న అహంకారం కలిగింది. అది కాస్త తీవ్ర రూపం దాల్చి యుద్ధ స్థాయికి చేరింది. లోకాలన్నీ ఆ తగవులాటవల్ల భీతిల్లుతున్న తరుణంలో చంద్ర శేఖరుడు హరిబ్రహ్మలకు జ్ఞానాన్ని ప్రసాదించాలనుకున్నాడు. వెంటనే వారి ముందు ఒక దివ్యతేజోరాశిని ఆద్యంతాలు తెలియని స్తంభలింగరూపంలో అవతరించేలా చేశాడు. అప్పటిదాకా అక్కడ లేని ఆ దివ్యతేజోస్తంభం ఏమిటా అని హరి, బ్రహ్మలు యుద్ధమాని విస్తుపోతూ చూశారు. వెంటనే పార్వతీ వల్లభుడు తన దివ్యలీలా విలాసంతో వారికి ఓ పరీక్ష పెడుతున్నానని, ఆ స్తంభం (లింగం) అగ్రభాగాన్ని ఒకరు, అడుగు భాగాన్ని మరొకరు చూసి రావాలని, ఎవరు ముందుగా వస్తే వారే గొప్పని, వారికే సర్వాధిపత్యం అని చెప్పాడు. వెంటనే బ్రహ్మ హంసరూపుడై ఆ తేజోలింగం అగ్రభాగానికి చేరటానికి వెళ్ళాడు. విష్ణువు వరాహరూపుడై ఆ లింగం మూలంఎక్కడుందో తెలుసుకోవటానికి పాతాళం వైపు ప్రయాణం చేశాడు.హరి, బ్రహ్మలకు ఆ దివ్యతేజో రాశి ఆద్యంతాలు ఎంతకీ అంతు పట్టలేదు. ఇంతలో పై నుండి ఒకకొతకి(మొగలిపువ్వు) రావటం హంస రూపంలో ఉన్న బ్రహ్మ చూశాడు. బ్రహ్మ మొగలి పువ్వును ప్రలోభపెట్టి తాను ముందుగా తేజో రాశి అగ్రభాగాన్ని చూశానని చెప్పుకోవటానికి సాక్ష్యంగా ఉండమని కోరాడు. పాతాళం వైపు వెళ్ళిన విష్ణువుకు తేజోరాశి పీఠభాగం ఎంత దూరం వెళ్ళినా కనిపించలేదు. ఇంతలో అబద్ధపు సాక్ష్యం చెప్పేందుకు మొగలి పువ్వును వెంట పెట్టుకొని శివుడి దగ్గరకొచ్చాడు. బ్రహ్మ, ఆ తర్వాత కొద్ది సేపటికి విష్ణువు తేజోలింగం అడుగు భాగం తాను కనుక్కోలేకపోయానని బాధపడుతూ పై కొచ్చాడు. శివుడికి బ్రహ్మ తేజోరాశి అగ్రభాగాన్ని తాను చూశానని అందుకు సాక్ష్యంగా కేతకిని కూడా వెంటపెట్టుకొచ్చానన్నాడు. ఆ అసత్య మాటలకు శివుడికి కోపం ముంచుకువచ్చిది. వెంటనే భైరవుడిని సృష్టించి అసత్యమాడినందుకు బ్రహ్మను దండించమన్నాడు.భైరవుడు అప్పటిదాకా బ్రహ్మకున్న ఐదుతలలలో అబద్ధం ఆడిన తలను తుంచేశాడు. తరువాత తప్పును తెలుసుకున్న బ్రహ్మ ఈశుడిని శరణు వేడుకొన్నాడు. పక్కనే ఉన్న విష్ణువు కూడా అప్పటికే శివుడి గొప్పప్పతనాన్ని గ్రహించి శివుడికి నమస్కరించాడు. బ్రహ్మ తప్పును క్షమించమని కూడా వేడుకున్నాడు. శరణాగత వత్సలుడైన శంకరుడు చల్లబడ్డాడు. ఇంతకు ముందు లాగానే బ్రహ్మకు సృష్టి అధికారం ఉంటుందని, అయితే ఇతర దేవతల్లాగా బ్రహ్మకు ఆలయాలు, పూజలు ఏవీ ఉండవని చెప్పాడు. అబద్ధం ఆడకుండా వాస్తవాన్ని తెలిపిన విష్ణువు అందరి చేత పూజలందుకుంటాడని, స్థితి కారకుడిగా వెలుగొందుతాడని అన్నాడు.మొగలిపువ్వును చూసి అసత్యమాడిన పాపానికి తన పూజలో మొగలిపువ్వుకు చోటుండదని అన్నాడు. అయితే ఆ కేతకి శివుడికి పరిపరివిధాల ప్రణమిల్లింది. భక్తవత్సలుడైన శివుడు అప్పుడు కొంత శాంతించి శివపూజకు పనికి రాకపోయినా శివభక్తులు మాత్రం మొగలిపువ్వును ధరిస్తారని, అలా జన్మను చరితార్థం చేసుకోమని చెప్పి అంతర్థానమయ్యాడు. ఈ కథా సందర్భంలో ఎంతటి వారైనా అసత్యమాడితే పాపఫలితాన్ని అనుభవించాల్సి ఉంటుందని తెలియజెప్పే సందేశం ఇమిడి ఉంది. మానవులంతా సత్యమార్గంలోనేనడుచుకోవాలన్న ఈశ్వర సందేశం ఇక్కడ కనిపిస్తోంది. అని వారు తెలియపరిచారు. సర్వేజనా సుఖినోభవంతు సమస్తదేవ సన్ మంగళానిభవంతు ఓం శాంతి శాంతి...









# ఆటపాటలతో కూడిన విద్యా విధానం అవసరం

## – జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

**ఖమ్మం, ఫిబ్రవరి 18 (మనం బ్యూరో) :**
హార్వెస్ట్ టెండర్ రూట్స్ పాఠశాల 13వ వార్షికోత్సవ వేడుకలు హార్వెస్ట్ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, నగర మేయర్ పునుకొల్లు నీరజ, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ. సోమశేఖర శర్మలు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఆటపాటలతో కూడిన విద్యా విధానాన్ని అవలంబించడం వలన విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించవచ్చని, క్రమశిక్షణ, సామాజిక అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. చిన్నారులను పూర్తి వ్యక్తిత్వం గల వారిగా తీర్చిదిద్దేందుకు అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించటానికి ఆయా పాఠశాలల యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ మాట్లాడుతూ చిన్నతనం నుండే క్రమశిక్షణాయుత, బాధ్యతతో కూడిన విద్యా విధానం ద్వారా పిల్లలు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. మారుతున్న ఆహారపు అలవాట్ల ద్వారా అనారోగ్యం చెందకుండా పిల్లలకు క్రీడలు ఎంతో అవసరమని, హార్వెస్ట్ యాజమాన్యం క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయమన్నారు.



హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్ మాట్లాడుతూ కరోనా పాండమిక్ ప్రభావం వలన రెండు సంవత్సరాలు పాఠశాలకు చిన్నారులు దూరంగా గడపవలసి రావడం ఎన్నో ఇబ్బందులకు విద్యార్థులు గురి కావలసి వచ్చిందని, దాని ప్రభావం తదనంత కాలంలో స్పష్టంగా కనబడిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ పార్వతీరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# నూతన మండలాలు, ఇల్లందు డివిజన్ ఏర్పాటు కోరుతూ పాదయాత్ర ప్రారంభించనున్న సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు

### సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో కొమరారం, బోడు మండలాల ఏర్పాటుకై మర్రిగూడెంలో సదస్సు

**ఇల్లందు, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :**
ఇల్లందు సిపిఐ ఎంఎల్ ఆధ్వర్యంలో శనివారం కొమరారం,బోడు మండలాలతో పాటు, ఇల్లందును రెవిన్యూ డివిజన్ గా ప్రకటించాలని కోరుతూ సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుల ఆధ్వర్యంలో మార్చి 2న మర్రిగూడెం నుండి పాదయాత్రప్రారంభమవుతుందని ఈ పాదయాత్ర లో బాగంగా మర్రిగూడెం బొంబాయి తండా పోలారం,పోచారం, కొమరారం, మాణిక్యరం, తదితర సెంటర్లలో బహిరంగ సభలు జరుగుతాయని, మార్చి 2 న జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం మర్రిగూడెంలో పంచాయితీ స్థాయి జనరల్ బాడీ న్యూడెమోక్రసి మండల నాయకులు పూణెం కోటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, చింత ఉదయ్, సర్పంచ్ రజిత మాట్లాడుతూ మార్చి 2న ప్రారంభమయ్యే పాదయాత్ర కు అన్ని వర్గాల ప్రజానీకం తమ మద్దతు ప్రకటించి,పాదయాత్రలో బాగస్వామ్యము కావాలని పిలుపునిచ్చారు.ఇంకా ఈ కార్యక్రమంలో



నాయకులు జోగా కాంతారావు, పూనం కోటన్న, గొగల రాజు,ఇరప పగడయ్య ,ఇరప విజయ్,జోగ రమేష్, పూనం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# మతోన్మాద శక్తులను తరిమికొట్టడమే అమరజీవి కామ్రేడ్ తులసికి ఇచ్చే ఘన నివాళి

## – వర్ధంతి సభలో నాయకుల ఉద్ఘాటన

**భద్రాచలం, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :**
దేశంలో మతోన్మాద శక్తులను తరిమికొట్టడమే అమరజీవి కామ్రేడ్ బండారు తులసికి ఇచ్చే ఘన నివాళి అని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్,పార్టీ సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్ లు అన్నారు. పార్టీ మాజీ శాఖ సెక్రెటరీ అమరజీవి కామ్రేడ్ బండారు తులసి 6వ వర్ధంతి సభ నాదెళ్ళ లీలావతి అధ్యక్షతన జరిగింది. ముందుగా తులసి చిత్రపటానికి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఏ.జె.రమేష్ సీనియర్ నాయకులు యలమంచి రవికుమార్లు పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మత ప్రాతిపదికన ప్రజలను విభజించి పాలిస్తున్నారని ఇది దేశ సమైక్యతకు ప్రమాదం అని అన్నారు. కార్మిక ,కర్షక వ్యతిరేక విధానాలను అమలు పరుస్తూ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని అటువంటి బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యవంతం చేసి మతోన్మాద శక్తులను తరిమి కొట్టాలని అదే బండారు తులసికి ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. రాష్ట్రంలో టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అన్నారు. భద్రాచలం నియోజకవర్గం లో సిపిఎం పార్టీ అభివృద్ధికి ప్రతి కార్యకర్త మొక్కవోని దీక్షతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కే. బ్రహ్మచారి,పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, సీనియర్ నాయకులు బిబిజి తిలక్, జిల్లా కమిటీ సభ్యులు సున్నం గంగా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు బండారు శరత్ బాబు, వై వెంకటరామారావు, పి సంతోష్ కుమార్,పట్టణ కమిటీ సభ్యులు డి సీతాలక్ష్మి, యు జ్యోతి, ఎస్ డి ఫిరోజ్ ఖాన్, కుంజ శ్రీనివాస్, జి లక్ష్మీకాంత్, కోరాడ శ్రీనివాస్, సీనియర్ నాయకులు ఏం వి ఎస్ నారాయణ, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు గౌతమి, శాఖ కార్యదర్శులు డి.రామకృష్ణ,గడ్డం. నాగలక్ష్మి, మాధవి,రోజా,తులసి కుటుంబ సభ్యులు బండారు సరస్వతి బండారు సత్యనారాయణ, బండారు సూర్యప్రసాద్, బండారు అమ్మాజీ బండారు సుందరయ్య, బండారు మావో కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మహాశివరాత్రి పర్వదినాన ఎంఎల్ఏ హరిప్రియ పూజలు



**ఇల్లందు, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** ఇల్లందు నియోజకవర్గ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ దంపతులు శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇల్లందు పట్టణం లోని కలసి బస్తీ 18 వ వార్డు లో గల గ్రందలయ శివాలయం లో అర్చకులు , ఇల్లందు నియోజకవర్గ శాసన సభ్యురాలు బానోత్ హరిప్రియ హరిసింగ్ నాయక్ దంపతులు కుటుంబ సమేతంగా పరమేశ్వరునికి ప్రత్యేక ధూప దీప నైవేద్య కైంకర్య పూజా కార్యక్రమాలు,అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఇల్లందు నియోజకవర్గ ప్రజలందరికీ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇల్లందు నియోజకవర్గ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, ఇల్లందు నియోజకవర్గం ఎల్లప్పుడూ కూడా సుభిక్షంగా ఉండాలని ఆ పరమశివుని వేడుకున్నట్టుగా ఎమ్మెల్యే హరిప్రియ నాయక్ తెలిపారు.. ఈ ప్రత్యేక కార్యక్రమంలో కుటుంబ సభ్యులు మాత్రమే పాల్గొనడం విశేషం.

## ఆలయాలకు పోటెత్తిన భక్తులు

### – ప్రత్యేక పూజలు నిర్వహించిన సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ దంపతులు



**ఖమ్మం, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :**
మహాశివరాత్రి పురస్కరించుకొని శనివారం ఖమ్మం నగరంలోని శ్రీ శ్రీ శ్రీ భ్రమరాంబ సమేత గుంటమల్లేశ్వర స్వామి దేవస్థానము,మమతా రోడ్ నందు దుర్గా మల్లిఖర్జున స్వామి దేవాలయం,ధంసలాపురం నందు శంభు లింగేశ్వర స్వామి దేవాలయం, కైకొండాయిగూడెం రోడ్డు ఖానాపురం హవేలీ నందు శ్రీ విశాలక్ష్మి సమేత శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి వారి ఆలయం మరియు ఖమ్మం రూరల్ మండలం తీర్థాల గ్రామంలోని శ్రీ సంగమేశ్వర దేవాలయాలను సందర్శించి స్వామి వారిని దర్శించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ,ఖమ్మం సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్ దంపతులు,మంత్రి పి.ఏ చిరుమామిళ్ల రవి కిరణ్ దంపతులు దేవాలయాల కమిటీ సభ్యులు అతిథులకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.ఆలయాల నందు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పసుమర్తి రామ్మోహన్ రావు,మేడారపు వెంకటేశ్వర్లు,సరిపూడి రమాదేవి సతీష్, చిరుమామిళ్ల లక్ష్మీ నాగేశ్వరరావు, నగండ్ల కోటేశ్వరరావు,సుడా డైరెక్టర్ దేవ భక్తుని కిషోర్ బాబు,సీనియర్ నాయకులు మాటేటి నాగేశ్వరరావు, బిక్కసాని జస్వంత్,కన్నం ప్రసన్న కృష్ణ,అంజిరెడ్డి,బ్రహ్మ రెడ్డి, నరసింహ,రమేష్,బ్రహ్మం,బి.అర్.ఎస్ పార్టీ నాయకులు మరియు ఆలయాల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను కొట్టిన ప్రిన్సిపల్ పై చర్య తీసుకోవాలి :ఏఐఎస్ఎఫ్

**మధిర, ఫిబ్రవరి 18 (మనం న్యూస్):**



మధిర పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకులంలో పదో తరగతి విద్యార్థిని రమ్య, కీర్తన, ప్రవళిక, హిమబిందు అనే విద్యార్థులను ప్రిన్సిపల్ కర్రతో వాతలు పడే విధంగా కొట్టడం జరిగిందని విషయం తెలుసుకొని ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా కార్యదర్శి ఇటుకల రామకృష్ణ ,జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ ,జిల్లా నాయకులు ఉజ్వల్, సుధాకర్ విద్యార్థులతో కలిసి మాట్లాడారు. కారణం లేకుండా విద్యార్థుల ను విచక్షణ రహితంగా కొట్టిన ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

# అస్తవ్యస్తంగా గురుకుల పాఠశాల నిర్వహణ

**మధిర టౌన్, ఫిబ్రవరి 18(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్రంలో బీసీ గురుకులాల పాఠశాలల నిర్వహణ అత్యంత దారుణంగా ఉన్నదని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండపల్లి శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. మధిరలో గురుకుల ఆశ్రమ పాఠశాల లో విద్యార్థులపై ప్రిన్సిపల్ అకారణంగా తీవ్రంగా కొట్టిందని వార్తలు రావడంతో సహచర బిజెపి నాయకులతో కలిసి శనివారం మధిర గురుకుల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన శ్రీధర్ రెడ్డి బాలికలను నేరుగా మాట్లాడి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ అకారణంగా మమ్మల్ని వాతలు వచ్చేలా కొట్టిందని వారు శ్రీధర్ రెడ్డికి వివరించారు. భోజనం విషయంలో కూడా నిబంధనలతో కూడినటువంటి మెనూ పాటించడం లేదని విద్యార్థినులు శ్రీధర్ రెడ్డితో వాపోయారు. ఈ నేపథ్యంలో శ్రీధర్ రెడ్డి ఖమ్మం జిల్లా జాయింట్ కలెక్టర్ మధుసూదన్ తో ఫోన్లో మాట్లాడారు. బాలికల ఇబ్బందులను జెసికి వివరించిన శ్రీధర్ రెడ్డి బాధిత బాలికలతో నేరుగా జాయింట్ కలెక్టర్ తో మాట్లాడించారు. ఈ సందర్భంగా జెసి సంఘటన పూర్వపరాలను విచారించి బాధ్యులపై చర్య తీసుకుంటామని చెప్పారు. అనంతరం కొండపల్లి శ్రీధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా పరీక్షల సమయంలో పిల్లలు ఒత్తిడికి గురికారాదని మానసిక ధైర్యంతో పరీక్షలు రాయాలని పిల్లలతో పరీక్షాపే చర్చ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తూ పిల్లలకు మానసిక ధైర్యాన్ని ఇస్తుంటే తెలంగాణలో పేద మధ్యతరగతి బలహీన వర్గాలకు చెందిన



పిల్లలు ప్రైవేటు విద్యని, ఫీజులు భరించలేక గురుకులాలలో చేరుతుంటే వారిని తెలంగాణ ప్రభుత్వం నిర్లక్ష్యంగా చూస్తుందని శ్రీధర్ రెడ్డి ఆరోపించారు. గురుకుల పాఠశాలల్లో ప్రధానంగా విద్యార్థులతో వ్యవహరించాల్సిన తీరుపై సిబ్బందికి తగిన శిక్షణ లేని కారణంగానే ఇటువంటి అవ మానవీయ సంఘటనలు జరుగుతున్నాయని ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గురుకులాన్ని సందర్శించిన వారిలో బిజెపి మధిర అసెంబ్లీ కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు ,ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ళపల్లి విజయరాజు, మధిర బిజెపి పట్టణ అధ్యక్షుడు బాపట్ల రమేష్, పెరుమాళ్ళపల్లి మోహన్ రావు, రాము, సాయి ,తదితరులు ఉన్నారు.

# గద్దల ఏడుకొండలుకు మార్పు స్వచ్ఛంద సంస్థ చేయూత

**వైరా టౌన్, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :**
బోనకల్ మండలం జానకిపురం గ్రామంలో బ్రెయిన్ క్యాన్సర్ తో బాధపడుతున్న గద్దల ఏడుకొండలు(26) కు మార్పు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. మార్పు స్వచ్ఛంద సంస్థ సభ్యులు ముప్పారపు ఉపేందర్ కూతురు ముప్పారపు శాన్వి పుట్టిన రోజు సందర్భంగా 5000 రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన గద్దల ఏడుకొండలు తండ్రి గద్దల వెంకటరావు ఆటో డ్రైవర్ గా జీవనం సాగిస్తున్నాడని, తన కుమారుడికి వైద్యం చేయించుకోవడానికి దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్న విషయాన్ని వైరా పట్టణానికి చెందిన రాచమల్ల శ్రీను ద్వారా తెలుసుకున్న మార్పు స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు గుడిమెట్ల రజిత శనివారం జానకీపురంలోని వారి ఇంటికి వెళ్ళి గద్దల ఏడుకొండలు ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుని ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా గుడిమెట్ల రజిత మాట్లాడుతూ మానవత్వంతో దాతలు ముందుకు వచ్చి గద్దల ఏడుకొండలుకు సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమాజం పట్ల బాధ్యతగా ఆపదలో



ఉన్నవారికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తున్న మార్పు స్వచ్ఛంద సంస్థ సభ్యులు, శ్రేయోభిలాషులను పలువురు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో మార్పు స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి గుడిమెట్ల మోహనరావు, సభ్యులు ముప్పారపు ఉపేందర్, షేక్ హాజిబాబా, రాచమల్ల శ్రీను, తేరాల సతీష్, గద్దల వెంకటరావు, గద్దల స్వరూపారాని తదితరులు పాల్గొన్నారు.

# వేదగిరి శ్రీనివాసరావు ఆశయాలను కొనసాగిద్దాం

## – సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు

**వైరా టౌన్, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :**
సిపిఐ (ఎం) వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అమరజీవి కామ్రేడ్ వేదగిరి శ్రీనివాసరావు 3వ వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదగిరి శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బోడపట్ల రవీందర్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు మాట్లాడుతూ నేడు దేశంలో రైతులు, కార్మికులు, కర్షకులకు పెద్ద ప్రమాదం పడవేసేవిదంగా కేంద్ర ప్రభుత్వం తీసుకోస్తున్న ప్రజా వ్యతిరేక చట్టాల వలన పెద్ద ప్రమాదం ఏర్పడిందని, కార్మికుల మనుగడ కష్టంగా మారిందని అన్నారు. ఈ దేశంలో 70 శాతం ప్రజలు చెల్లిస్తున్న పన్నులు, ట్యాక్సులు, ఇన్సూరెన్స్ కంపెనీలకు వచ్చే ఆదాయాన్ని బడా పెట్టుబడిదారులకు దోచిపెడుతూ రైతులు, కార్మిక, కర్షకులకు రోడ్డున పడేసే విధంగా చట్టాలు తీసుకొస్తున్నారని అన్నారు. ఇటువంటి పరిస్థితులలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రజలను కూడగట్టి పెద్ద ఎత్తున ఆందోళనలు, పోరాటాలు చేయడం ద్వారా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వాన్ని తిప్పి కొట్టాలని, ఇదే అమరజీవి యాదగిరి శ్రీనివాసరావుకు ఇచ్చే నిజమైన నివాళులు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భుక్యా వీరభద్రం, వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, పట్టణ నాయకులు చింతనిప్పు చలపతిరావు, మల్లెంపాటి రామారావు, బొంతు సమత, హరి వెంకటేశ్వరావు, అనుమోలు రామారావు, పైడిపల్లి సాంబశివరావు, కొంగర సుధాకర్, గుమ్మా నరసింహారావు, మల్లెంపాటి ప్రసాదరావు, తోట కృష్ణవేణి, వేల్పుల మైకేల్, వడ్లమూడి మధు తదితరులు పాల్గొన్నారు.



# శంభు లింగేశ్వరాలయంలో వైభవంగా మహా శివరాత్రి ఎమ్మెల్యే రాములు నాయక్ పూజలు



**కొణిజర్ల ఫిబ్రవరి 18 (మనం న్యూస్ ):** కొణిజర్ల మండలం, పల్లిపాడు గ్రామంలోని శ్రీ స్వయంభు శంభు లింగేశ్వర స్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ ఎనగంటి కృష్ణ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా మహాశివరాత్రి జరిగింది. ముఖ్య అతిథిగా వైరా ఎమ్మెల్యే రాములు నాయక్ పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అన్న దాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.వివిధ గ్రామాల నుంచి దాదాపు 12,000 మంది భక్తులు హాజరయ్యారు.కమిటీ వారు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. పోలీస్ శాఖ మరియు ఠాగూర్ వారి క్రాంతి జూనియర్ కళాశాల నుంచి 20 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ సహకారంతో విజయవంతంగా మహాశివరాత్రి వేడుకలు జరిగాయి.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు గ్రామ పెద్దలు,వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మోతెగడ్డ వీరభద్ర స్వామిని దర్శించుకున్న మాజీ తానా అధ్యక్షుడు తాళ్లూరి జయ శేఖర్



**భద్రాచలం, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** శివరాత్రి పర్వదినం సందర్భంగా మోతెగడ్డ వీరభద్ర స్వామిని మాజీ తానా అధ్యక్షుడు తాళ్లూరి జయ శేఖర్, నీలిమ దంపతులు దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం జయ శేఖర్ స్వామివారిని దర్శించుకుని అభిషేకాలు చేయించారు.మోతె గ్రామంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమానికి తాళ్లూరి భారతీదేవి జ్ఞాపకార్థం తాళ్లూరి పంచాక్షరయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ. 20,000 వితరణ చేశారు,మోతె గ్రామంలో ఏర్పాటు చేసిన అన్నదాన శిబిరాన్ని జయశేఖర్ నీలిమ ప్రారంభించారు.ఆయన వెంట జడ్పిటిసి సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాస రావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు వల్లూరిపల్లి వంశీకృష్ణ పాల్గొన్నారు.

# తమిళనాడు వాసికి వైరా సిపిఐ పార్టీ సహాయం



**వైరా టౌన్, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :**
తమిళనాడు రాష్ట్రం నాగపట్నం జిల్లా నివాసి కామ్రేడ్ ఆర్ చంద్రశేఖర్ తండ్రి రాజన్ బాబు ,తెలంగాణ రాష్ట్రంలో బోర్వెల్ ఆపరేటర్ గా తమిళనాడుకు చెందిన ఒక కాంట్రాక్టర్ ద్వారా ఖమ్మం జిల్లాకు వచ్చి బోరు వేస్తుండగా 168 అడుగులలో బిట్లు ఇరుకుక పోయినందున కాంట్రాక్టర్ ఆగ్రహంతో కామ్రేడ్ఆర్ చంద్రశేఖర్ ను వైరాలో వదిలిపెట్టి వెళ్లినందున కామ్రేడ్ చంద్రశేఖర్ తమిళనాడు రాష్ట్రం నాగపట్నం జిల్లా చేరేందుకు తిరుగు ప్రయాణ ఖర్చులు లేనందున తన పార్టీ అయిన వైరాలోని సిపిఐ పార్టీ కార్యాలయాన్ని ఆశ్రయించగా మండల కార్యదర్శి యామాల గోపాలరావు అన్ని పూర్తి వివరాలు తెలుసుకొని తనకు మండల కార్యకర్తల సహాయ సహకారాలతో తనకి హార్దిక చేయూతనిచ్చి తిరుగు తన గ్రామానికి వెళ్లేందుకు వ్యయ ప్రయాసలకు సంబంధించి నా ఖర్చులను సమకూర్చి తన గ్రామానికి వెళ్లేందుకు సహాయ సహకారాలు అందించినారు. ఈ కార్యక్రమంలో మండల ఏఐటియుసి కార్యదర్శి గారపాటి అశోక్ ,రైతు సంఘం నాయకులు కొండా రామకృష్ణ ,వ్యవసాయ కార్మిక సంఘం మండల నాయకులు పఠాన్ కరిముల ,ఏఐటిసి నాయకులు మూటకొండ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి నాయకులు రాయపూడి శ్రీనివాసరావు, మొదలగువారు పాల్గొని ఈ సహాయ సహకారాలు అందించినారు.

# జోరుగా సాగుతున్న గుట్ట జాతర...

**– కోనేటి స్నానాలు ....అభిషేకాలు**
**– భక్తులతో కిక్కిరిస్తున్న ఆలయాలు**



**మరిపెడ, ఫిబ్రవరి 18 (మనం న్యూస్):** మహబూబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయి పాలెం గ్రామ శివారులో శ్రీ ఆగస్టువేశ్వర స్వామి గుట్ట జాతర శనివారం నుండి జోరుగా సాగుతుంది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులు శనివారం తెల్లవారుజామున నుండి కోనేటి స్థానాలు అభిషేకాలు చేసుకోవడానికి భక్తులు వందలాదిగా తరలివచ్చి క్యూలో నిల్చున్నారు.పూజారి ప్రసాద్ శర్మ భక్తులకు అభిషేకాలు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారి ప్రసాదు శర్మ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వ దినంలో నియామనిష్టాలతో ఉపవాసం జాగారం చేసిన వారికి ముక్తిని ప్రసాదించే భాగ్యం కలుగుతుందని ప్రతితి అన్నారు. భాద్రపద మాసంలో ఆకాశమార్గాన దివ్యమైన ప్రకాశ దర్శనమిచ్చే జ్యోతి స్వరూపుడు శ్రీ అగస్తేశ్వర స్వామి అన్నారు. అందుకే శివునికి ఇష్టమైన ఆహారం పులిహోర అన్నారు. ఈ సందర్భంగా ఆగస్టేశ్వర స్వామి దేవాలయం గుడి చుట్టూ భక్తులు వారికి పులిహోర బెల్లం పానకం ఇక్కడి విశిష్టత కలిగిరి స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. ఇంత చరిత్ర కలిగిన దేవాలయానికి దాతలు ముందుకు వచ్చి అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు.

**భక్తులకు పులిహోర, చలివేంద్రం, హెల్త్ క్యాంపు :** మహాశివరాత్రి సందర్భంగా గుట్టపైన మూడు రోజులపాటు జరిగే ఈ జాతరకు వివిధ జిల్లాలు రాష్ట్రాలు నుండి తరలి వస్తున్న భక్తులకు సౌకర్యంగా తాగునీటి సౌకర్యం ,పులిహోర ప్రసాదం, తో పాటు ప్రాథమిక ఆరోగ్య సబ్ సెంటర్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపును డాక్టర్ రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది భక్తులకు గ్లూకోస్ పొట్లాలు, మందులు అందుబాటులో ఉంచారు. గుట్టపైన ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కోనేరు చుట్టూ రెవెన్యూ సిబ్బందిని కాపలాగా ఏర్పరిచారు. అభిషేకాలు చేసే సందర్భంగా గర్భగుడిలో ఇరుకుగా మారడంతో పూజలు ఆలస్యంగా జరుగుతున్నాయని భక్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామపంచాయతీ సిబ్బంది స్థానిక సర్పంచి అందుబాటులో లేకపోవడంతో క్యూలో ఉన్న భక్తులు ఇబ్బందులకు గురయ్యారు.

# గార్లలో ఘనంగా కంఠ్లమహేశ్వరస్వామి బోనాలు



**గార్ల, ఫిబ్రవరి 18 (మనం ప్రతినిధి):** ప్రతి యేటా గౌడ కులస్తుల ఆద్వర్యంలో మహాశివరాత్రి సందర్భంగా నిర్వహించే కంఠ్లమహేశ్వరస్వామి బోనాల మహోత్సవం అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు. ముందుగా గౌడ కులస్తుల ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో చేసిన బోనాలను ఎత్తుకొని మండల కేంద్రంలోని పురవీధుల గుండా డప్పు వాయిద్యాలతో ఆటపాటలతో గుంపుగా బయలుదేరి స్థానిక తహశీల్దారు కార్యాలయం సమీపంలో గల గౌడకులస్తుల ఇలవేల్పు అయిన శ్రీ కంఠ్లమహేశ్వరస్వామి ఆలయంకు చేరుకొని ఆడపడుచులు తెచ్చిన బోనాలను స్వామివారికి సమర్పించి అక్కడ ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పలు సాంస్క ృతిక కార్యక్రమాలలో ఆడపడుచులు పాల్గొన్నారు.అనంతరం పలువురు గౌడ కులస్తులు కంఠ్లమహేశ్వరస్వామి జీవిత చరిత్రను విపులంగా వివరించారు. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని అన్ని శివాలయాలు భక్తులతో కిక్కిరిసి హరిహర నామస్మరణతో మారుమ్రోగాయి. ఈ కార్యక్రమంలో గార్ల గౌడ సంఘం అధ్యక్షులు మండ రవి గౌడ్, కోల కుమార్ గౌడ్ సభ్యులు తోడేటి శ్రీనివాస్ గౌడ్, గార్ల గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ కందునూరి ఉమామహేశ్వరరావు గౌడ్, తోడేటి విజయరాముడు,కందునూరి శ్రీనివాస్ గౌడ్,మోత్కూరి మనోహర్ గౌడ్,గణబోయిన రాజు గౌడ్, తాళ్ళపల్లి కృష్ణ గౌడ్, కొత్తకొండ కుమార్ గౌడ్, బూర్ల రాము గౌడ్, బూర్ల సతీష్ గౌడ్, తోడేటి నాగరాజు గౌడ్, మండ శ్రీను గౌడ్, కత్తి శివ గౌడ్, రంజిత్ గౌడ్, కొండ ఈశ్వర్ గౌడ్,మోత్కూరి ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు బియ్యం అందజేత



**తొర్రూరు, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** ఇటీవల అకాల మరణం చెందిన మృతుల కుటుంబాలకు బీజేపీ రాష్ట్ర నాయకులు,నియోజకవర్గ ఇంచార్జ్ పెదగాని సోమయ్య శనివారం సందర్శించి పరామర్శించి ఓదార్చారు.అనంతరం పెదగాని కళావతి సోమయ్య (పీకేఎస్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ నగర్ లో జలగం ఎల్లమ్మ,మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన కిన్నెర సోమయ్య లు అకాల మరణం చెందడంతో వారి కుటుంబ సభ్యులకు 50 కేజీల చొప్పున బియ్యంను అందజేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ పేద బడుగు, బలహీన వర్గాల కోసమే పీకేఎస్ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక సేవ కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయన్నారు. పేదలను గుర్తించి ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్, ఓబీసీ మోర్చ రాష్ట్ర నాయకులు జలగం వెంకన్న, నాయకులు గుండా సురేష్, సిరిపాటి శివాజీ, కిన్నెర రాజకుమార్,అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు మంగళపల్లి ఆశయ్య, మంగళపల్లి యాకయ్య,యాకేందర్ తదితరులు పాల్గొన్నారు.

## మనం మహబూబాబాద్

# మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తుల సందడి



**తొర్రూరు, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** తొర్రూర్ డివిజన్ కేంద్రంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం తొర్రూరు పట్టణ కేంద్రంలో గల, కంటే పాలెం రోడ్డు లోగల శివాలయంలో, శివ భక్తులు బారులు తీరారు, ఆలయ గోపురం నుండి, మెయిన్ గేటు వరకు రెండు మూడు లైన్లలో భక్తులు వేచి ఉండవలసి వచ్చింది, ఈ ఆలయంలో కాకుండా, మున్సిపల్ కేంద్రానికి సమీపంలో ఉన్న శివాలయంలో కూడా భక్తుల రద్దీ అధికంగానే ఉంది ఈరోజు, ప్రతి సంవత్సరం, ఈసారి కూడా శివాలయంలో, ఆలయానికి రంగులు వేసి పూలమాలలతో సుందరంగా అలంకరించడం జరిగింది, భక్తులు కూడా, ఇలాంటి తొందరపాటు లేకుండా, ఎవరి స్థాయికి తగినట్లు వారు, అభిషేకాలు, అర్చనలు, పూజలలో, పాల్గొనడం జరిగింది, ఎక్కడ కూడా తోపులాట లేకుండా భక్తులు భక్తిశ్రద్ధలతో ఓపికతో ప్రశాంతతగా శివుడిని దర్శించుకుంటున్నారు, రెండు ప్రధాన ఆలయాలలో, కావలసిన సౌకర్యాలు ఏర్పాటు చేయడంతో పాటు, తీర్థ ప్రసాదాలు నైవేద్యాలను, భక్తులకు అందించడం జరిగింది.

# అభివృద్ధే ఎమ్మెల్యే రెడ్యానాయక్ ధ్యేయం

**– జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గుడిపూడి నవీన్ రావు**



**మరిపెడ, ఫిబ్రవరి 18 (మనం న్యూస్):** డోర్నకల్ నియోజకవర్గ ప్రాంత అభివృద్ధి, లేవు నువ్వు తొందర పడలే కానీ వాస్తవం చెప్పనా ప్రజల సంక్షేమమే ఎమ్మెల్యే రెడ్యానాయక్ ధ్యేయమని, అనునిత్యం ప్రజల కోసం ప్రజా ప్రయోజనాల కోసం ఆలోచిస్తూ తన నియోజకవర్గ అభివృద్ధి కొసం అహర్నిషలు కృషి చేస్తున్న వ్యక్తి రెడ్యానాయక్ అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ గుడిపూడి నవీన్ రావు అన్నారు. శనివారం ఆయన మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని 5వ వార్డులో టీయూఎఫ్ఐడీసీ పనులకు సంబంధించి సీసీల రెన్యూవల్ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని ప్రజల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారికి కావాల్సిన సదుపాయాలను కల్పించటంలో ఎమ్మెల్యే ముందుంటారన్నారు. మరిపెడ మేజర్ గ్రామ పంచాయతీ నుంచి మునిసిపాలిటీగా రూపాంతరం చెందాకా చిన్న పట్టణం అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కావాలని కొట్లాడి రూ.20కోట్లు టీయూఎఫ్ఐడీసీ తరపున తీసుకొచ్చారన్నారు. అందులో భాగాంగానే నేడు మరిపెడ పట్టణాన్ని చాలా వరకు సుందరంగా తీర్చి దిద్దుకున్నామన్నారు. ఈ నిధుల నుంచే మరిపెడ గ్రామంలో సీసీలు, డ్రైయినేజీలు, కమ్యూనిటీ భవనం, వైకుంతధామం, డంపింగ్ యార్డు, మినిపార్కు, ఓపెన్ జిమ్, సెంట్రల్ లైటింగ్, హైమాస్ట్ లైటింగ్, వెజ్ మార్కెట్, ఇలా ఎన్నో పనులు ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు, టీయూఎఫ్ఐడీసీ నిధుల నుంచి నిర్మించుకుని నేడు పట్టణాన్ని సుందరీకరించుకున్నామన్నారు. అందులో భాగంగానే నేడు 5వార్డులో సుమారు రూ. 20లక్షలతో 200మీటర్ల మేర సీసీ రెన్యూవల్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. ఇంకా రానున్న రోజుల్లో పట్టణాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. ఆయన మరిపెడ వైద్యాధికారి డా. గుగులోత్ రవి, భారాసా నాయకులు నారెడ్డి సుదర్శన్ రెడ్డి, పానుగోతు వెంకన్న, వస్రాం, తదితరులున్నారు.

# తెలంగాణ పోలీసింగ్ దేశానికే ఆదర్శం

**– రాష్ట్రంలో మొదటిసారి మదర్ అండ్ చైల్డ్ ఫ్రెండ్లీ రూమ్ ఏర్పాటు**
**– జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ను అభినందించిన మంత్రి**
**– శాంతి భద్రతల పరిరక్షణ, మహిళల రక్షణ, నేర విచారణ, నెరస్థులకు శిక్షలు పడేలా చేయడంలో అగ్రభాగంలో తెలంగాణ పోలీస్**
**– రాష్ట్ర,జిల్లా ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి సత్యవతి రాథోడ్**



**మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్ లో మదర్ అండ్ చైల్డ్ ఫ్రెండ్లీ రూమ్ ను రాష్ట్ర గిరిజన, స్త్రీ – శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ ప్రారంభించారు.శాంతి భద్రతల పరిరక్షణలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర గిరిజ, స్త్రీ – శిశు సంక్షేమ శాఖల మంత్రివర్యులు శ్రీమతి సత్యవతి రాథోడ్ అన్నారు. గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన వెంటనే అభివృద్ధితో పాటు పోలీస్ వ్యవస్థ ఆధునీకరణపై దృష్టి సారించారని, ఆయన దిశనిర్ధేశంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ నడుం బిగించిందని పేర్కొన్నారు. శనివారం రోజు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో టౌన్ పోలీస్ స్టేషన్ లో మదర్ అండ్ చైల్ ఫ్రెండ్లీ రూమ్ ను మంత్రి సత్యవతి రాథోడ్ ప్రారంభించారు. ఫిర్యాదులు చేయడానికి, దోషులను కలవడానికి, పోలీస్ స్టేషన్ కు చిన్నారులతో వచ్చే మహిళలు ఇబ్బందులు పడకుండా ఈ ప్రత్యేక రూమ్ ఉపయోగపడుతుందని తెలిపారు. పిల్లలకు పోలీస్ స్టేషన్ అనే భావన కలగకుండా ఆడుకోవడానికి, చిన్నారులు నిద్రించడానికి ఈ ప్రత్యేక రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ఎస్పీ శరత్ చంద్ర పవార్ ను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.తెలంగాణ పోలీసులు ఫ్రెండ్లీ పోలీస్ అని పోలీస్ వ్యవస్థ పై ప్రజల్లో నమ్మకం కలిగిస్తున్నారని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. ఫిర్యాదుల కోసం పౌరులు స్వేచ్ఛగా పోలీసులను ఆశ్రయిస్తున్నారని స్పష్టం చేశారు. మహిళల కోసం ప్రత్యేక ఇంటర్వ్యూ గదిని మరియు మహిళా సిబ్బందిని ఏర్పాటు చేయడం వల్ల మహిళలు వారి సమస్యలను ఎటువంటి సంకోచం లేకుండా వచ్చి చెప్పే విధంగా సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తెలంగాణలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ షీ టీమ్ లను సఖి సెంటర్, భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ పోలీసులు కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు.రాష్ట్ర ఏర్పాటుకు ముందు పోలీస్ వ్యవస్థ మొత్తం చీకటిలో ఉండేదని, అరకొర జీతాలతో, సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులతో ఉన్నదని అన్నారు. రాష్ట్రం ఏర్పాటు తర్వాత గౌరవ ముఖ్యమంత్రి కేసీఆర్ గారు పోలీసులకు ఎక్స్ గ్రేషియా పెంచడంతోపాటు దేశంలోనే అత్యుత్తమ ప్యాకేజీలను అందించడం జరుగుతుందని తెలిపారు. అంతేకాకుండా హోంగార్డుల జీతాలను కూడా పెంచి.. వారి గౌరవాన్ని ముఖ్యమంత్రి కేసీఆర్ కాపాడారని అన్నారు. ఈకార్యక్రమంలో ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీ తక్కెళ్ళపల్లి రవీందర్ రావు ఎమ్మెల్యే శంకర్ నాయక్, జిల్లా కలెక్టర్ శశాంక, ఎస్పీ శరత్ చంద్ర పవార్, పోలీస్ సిబ్బంది అధికారులు మరియు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# వీరభద్ర స్వామి వారిని దర్శించుకున్న బీఆర్ఎస్ మండల నాయకులు



**డోర్నకల్, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** మహాశివరాత్రి సందర్భంగా డోర్నకల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నున్న రమణతో సహా మండల నాయకులు కురవి శ్రీ వీరభద్ర స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వీరన్న, పట్టణాధ్యక్షుడు విద్యాసాగర్, గోర్ల సత్తిరెడ్డి, బిక్షం రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బోయినపల్లి వెంకన్న,పోటు జనార్ధన్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. డోర్నకల్ మండలం ఫిబ్రవరి 18 మనం న్యూస్ మహాశివరాత్రి సందర్భంగా డోర్నకల్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నున్న రమణతో సహా మండల నాయకులు కురవి శ్రీ వీరభద్ర స్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డోర్నకల్ మున్సిపల్ చైర్మన్ వీరన్న, పట్టణాధ్యక్షుడు విద్యాసాగర్, గోర్ల సత్తిరెడ్డి, బిక్షం రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బోయినపల్లి వెంకన్న,పోటు జనార్ధన్, బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# మృత్యుంజయ స్వామికి ప్రజా ప్రతినిధులు ప్రత్యేక పూజలు







**మధిర ,ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మధిరలోని మహిమాన్విత శ్రీ మృత్యుంజయ స్వామి వారి ఆలయంలో శనివారం మధిర శాసనసభ్యులు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క నందిని దంపతులు,మరియు జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజ్ వసంత దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ చైర్మన్ వంకాయలపాటి నాగేశ్వరరావు, ఈవో జగన్మోహన్ రావు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం భట్టి విక్రమార్క, మరియు లింగాల కమల్ రాజు దంపతులకు అర్చకులు ఆశీర్వచనాలు అందించగా ఆలయ చైర్మన్, ఈవో, కమిటీ సభ్యులతో కలిసి దుషాలువాతో సన్మానించారు.

# ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించాలి

## – తొర్రూర్ డివిజనల్ అధికారి ఎల్. రమేష్



**తొర్రూరు, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్పర్సన్ ఉషా దయాకర్ రావు జన్మదిన పురస్కరించుకొని శనివారం శ్రీవాణి ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపకులు డాక్టర్ నాగమణి ఆద్వర్యంలో పుట్టినరోజు వేడుకలను కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిందు శ్రీనివాస్ ,నాగవాణి,దామర సురేష్ ,కందగట్ల సులోచన ,సహకారంతో అంగన్వాడి సెంటర్లకి 15 బరువు తూచే యంత్రాలను పంపిణీ చేశారు డాక్టర్ నాగమణి మాట్లాడుతూ సమ సమాజాన్ని నిర్మించాలి .అంటే నేటి బాలలే రేపటి పౌరులుగా మారే ఈ సమాజంలో అంగన్వాడి సెంటర్లకు వచ్చే పిల్లల పౌష్టికాహార లోపం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన మీదే ఉంది వారికి కావలసినటువంటి పౌష్టిక ఆహారాన్ని అందించాలి .తద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించబడుతుంది అని అన్నారు . ఈ సమావేశంలో పాల్గొన్న తొర్రూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి రమేష్ మాట్లాడుతూ ఎర్రబెల్లి ట్రెస్ చైర్ పర్సన్ గా ఎర్రబెల్లి ఉష దయాకర్ రావు అనేక సామాజిక కార్యక్రమాలను సమాజంలో ఉన్న వెనుకబడినటువంటి వర్గాలకు అందిస్తూ ముందుకు వెళ్తున్నారు వారి పుట్టినరోజు సందర్భంగా ఈ విధంగా బరువు తూచే యంత్రాలను అంగన్వాడి కేంద్రాలకు ఇవ్వడం సంతోషకరమైనటువంటి విషయం కాబట్టి అందరూ వారి వారి పుట్టినరోజు లను పురస్కరించుకొని సామాజిక సేవలో పాల్గొనాల్సిందిగా కోరుతున్నాము ఈ కార్యక్రమంలో బిందు శ్రీను వాస్ ,పచ్చ సోమయ్య ,సూపర్వైజర్స్ గౌసియా ,సునీత,ధర్మశ్రీ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు విమల మరియు అంగన్వాడి ఉపాధ్యాయులందరూ తదితరులు పాల్గొన్నారు.

# శివ భక్తులతో కిక్కిరిసిన పిండిప్రోలు వీర కాశీపట్నం



**తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాల్లో శివనామ స్వరం తో భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు తెల్లవారుజామునుండే భక్తులు శివాలయాలకు క్యూ కట్టారు మండల పరిధిలోని పిండిప్రోలు సమీపంలో ఉన్న వీర కాశీపట్నం బీరోలు సుబ్లేడు పాతర్లపాడు కాకరవాయి తదితర గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిండిప్రోలు గ్రామ శివారు లో ఉన్న వీర కాశీపట్నం ఆలయ నిర్మాణ ప్రదాత ప్రధాన అర్చకులు ధర్మకర్త పూజారి మడికంటి వీరభద్రస్వామి సుగుణమ్మ గురుస్వామి మడికంటి శంకర్ నాగమణి దంపతులు మాట్లాడుతూ సంస్థ లోకాలకు కారణజన్ములైన శివపార్వతులను దర్శించుకున్న వారికి కష్టాలు దరి చేరవని వారన్నారు వేకువ జామ్ నుండే స్వామి వారికి పంచ అభిషేకాలతో అర్చన కార్యక్రమం అలంకరించిన మండపాలలో శివ పార్వతులు కళ్యాణం లింగోద్ధారణ కార్యక్రమం అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించబడ్డాయి వీర కాశీ పట్టణానికి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలతో పాటు ఇతర జిల్లాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలు హాజరై శివ పార్వతుల కళ్యాణాన్ని తిలకించారు. మూడు గ్రామాల దంపతులు పీటల మీద కూర్చొని కళ్యాణాన్ని వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల భక్తులతో పాటు వరంగల్ మహబూబాబాద్ సూర్యపేట ఖమ్మం జిల్లాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సిసి రోడ్డు ప్రారంభోత్సవం





**మహబూబాబాద్ టౌన్, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** మల్యాల గ్రామంలో సర్పంచ్ ఆవుల కూమరి –వెంకన్న గారి అధ్యక్షతన జరిగిన సీసీ రోడ్ ప్రారంభోత్సవంలో జెడ్పీ కో ఆప్షన్ సభ్యులు షేక్ మహబూబ్ పాషా, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు తపెట్ల వెంకన్న ఎంపీటీసీ బాదవత్ బద్రి చంద్రు ,ఉప సర్పంచ్ జెట్టంగి స్వరూప లింగన్న ,బీఆర్ఎస్ నాయకులు బోంత వెంకన్న ,గడ్డమీది రమేష్ను,సురేష్. వెంటేశ్వర్రావు. అబ్దుల్లా.వెంకటేష్.యాకన్న. మహేష్.గిరిబాబు. ఎంచాయతి కార్యదర్శి సుందర్ పాల్గొన్నారు.

# సంగమేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించిన కలెక్టర్, సీపీ

**ఖమ్మం, ఫిబ్రవరి 18 (మనం బ్యూరో) :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమిషనర్ విష్ణు యస్. వారియర్ లు కుటుంబ సమేతంగా ఖమ్మం రూరల్ మండలం తీర్థాల శ్రీసంగమేశ్వర ఆలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రసిద్ధి గాంచిన శ్రీ సంగమేశ్వర అలయన్ని ప్రతి సంవత్సరం మహా శివరాత్రి సందర్భంగా దర్శించుకుంటామని ఈ ఏడు కుడా దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు వారు తెలిపారు.



# గణపేశ్వరాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి దంపతులు

**కూసుమంచి, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** మండల కేంద్రం లోని శ్రీ గణపరేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పాలేరు శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి, సతీమణి విజయమ్మ స్వామి వారిని దర్శించు కున్నారు. భక్తుల కొరకు సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన పులిహోర ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కందాళ దంపతులు, అనంతరం భక్త్ లకు శుభాకాంక్షలు తెలిపారు.



# మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేసిన నంద్యాల రవీందర్‌రెడ్డి

**కూసుమంచి, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** మహాశివుడు శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని, తెలంగాణ రాష్ట్ర ప్రజలకు శివరాత్రి శుభాకాంక్షలు తెలియజేసిన వైయస్సార్ టిడిపి వైయస్ షర్మిల వ్యక్తిగత సహాయకులు నంద్యాల రవీందర్రెడ్డి, ప్రజలంతా భక్తిశ్రద్ధలతో మహా శివరాత్రి ఉపవాస దీక్షను, ఆచరించి భగవంతుడు ఆశీర్వాదానికి భక్తులంతా తమ తమ భక్తి ప్రవచనాలను ఆచరించి, ఆ మహా శివపార్వతులకు కళ్యాణ మహోత్సవ కార్యక్రమాలలో పాల్గొని, ఆ దేవుడు ఆశీర్వాదాలు పొందాలని, తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, మనస్ఫూర్తిగా కోరుకున్నారు,కూసుమంచి లో జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వైవీ రెడ్డి, ప్రధాన అధ్యక్షులు ఉపేందర్, పాలేరు విభాగ విభజన అధ్యక్షులు బానోత్ కిషోర్, కొక్కిరేణి రమేష్, బొమ్మగాని ఉపేందర్, బోడపట్ల నరేష్, మరియు కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.



# సీసీ రోడ్డు నిర్మాణానికి శంఖుస్థాపన చేసిన ఎమ్మెల్యే మెచ్చా

**దమ్మపేట, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట(నియోజకవర్గం), దమ్మపేట (మండలం), ముష్టిబండ – వడ్లగుడెం గ్రామాల్లో శివారులో వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవాలయానికి సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ. 1 కోటి నిధులు మంజూరు చేయించి శనివారం స్థానిక ప్రజా ప్రతినిదులుతో కలిసి అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చ నాగేశ్వరావు చేతుల మీదుగా శంఖుస్థాపన చేశారు. అనంతరం మహాశివరాత్రి సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.(ఆలయానికి 1కోటి.రు లతో సీసీ రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సేవా చేయడానికే ఆ భగవంతుడు మనకు పదవులు ఇచ్చాడని ఈరోజు మన దేవాలయానికి 1కోటి రు.సీసీ రోడ్డు నిర్మాణం కోసం శంఖుస్థాపన చేయడం



చాలా సంతోషంగా ఉందని అన్నారు తదనంతరం దమ్మపేట గ్రామంలో శివాలయంలో జరుగుతున్నటువంటి కార్యక్రమాల్లో కూడా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు,మండల పార్టీ అధ్యక్షుడు దొడ్డకుల రాజేశ్వరరావు,సొసైటీ చైర్మన్ రావు జోగేశ్వరరావు,ఆలయ చైర్మన్ రావు గంగాధర్ రావు,ప్రధాన కార్యదర్శి దొడ్డ రమేష్,వైస్ ఎంపీపీ దారా మల్లికార్జున్ రావు,ఎంపీటీసీ కోటగిరి రావు రమా దేవి,దారా యుగంధర్, తుతా రామకృష్ణ, తుతా నాగమణి,ఎర్ర వసంతం,కొయ్యల అచ్యుత్ రావు, కూకలకుంట రమేష్, కూకలకుంట రవి, ఫస్ట్ బండి సర్పంచ్ తిరుపతి రావు,ఉప సర్పంచ్ కూకలకుంట మాధవ రావు,ఊ దతనేని మధు, దమ్మపేట టౌన్ అధ్యక్షులు యార్లగడ్డ బాబు,పానుగంటి సత్యనారాయణ, భక్తులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సల్లంగా చూడు శివయ్య...

**– శైవాలయాల్లో పొంగులేటి ప్రత్యేక పూజలు**



**ఖమ్మం, ఫిబ్రవరి 18 (మనం బ్యూరో) :** మహా శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకొని ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు శైవాలయాలను శనివారం సందర్శించారు. దమ్మపేట శివాలయం, పెనుబల్లి నీలాద్రీశ్వరాలయం, పుల్లయ్య బంజరలోని అప్పయ్య స్వామి గుడి, వైరాలోని స్నానాల లక్ష్మీపురం, ఖమ్మం నగరంలోని గుంటు మల్లన్న, ఖమ్మం రూరల్ తీర్థాల కూడలి జాతర, కూసుమంచి గణపేశ్వర ఆలయాలను సందర్శించారు. ఆయా ఆలయాల్లో జరిగిన ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు, రుద్రాభిషేకాల్లో పాల్గొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని శివయ్యని వేడుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పొంగులేటిని ఆలయ మర్యాదలతో సత్కరించారు.

# మహాశివరాత్రి సందర్భంగా శివలింగానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు



**ఖమ్మం టౌన్, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** శని త్రయోదశి మహాశివరాత్రి సందర్భంగా ప్రభాస్ టాకీస్ రామాలయం రోడ్డు శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయంలో కొలువై ఉన్న శివలింగానికి శనివారం ఆలయ ప్రధాన అర్చకులు గట్టు హరీష్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుండి ప్రత్యేక పూజలు , అభిషేకాలు నిర్వహించారు . భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని శివుని కృపకు పాతులయ్యారని తెలిపారు . అనంతరం వచ్చిన భక్తులు తీర్థ ప్రసాదాలు స్వీకరించారు .

# నేటి నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎంపీ నామ పర్యటన

**ఖమ్మం, ఫిబ్రవరి 18 (మనం న్యూస్) :** బీఆర్ ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు ఈ నెల 19, 20 తేదీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారని ఖమ్మం ఎంపీ క్యాంప్ కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. 19వ తేదీ ఆదివారం ఉదయం సత్తుపల్లి శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య తో కలిసి కల్లూరు మండలం లో కల్లూరు, కప్పలబంధం, చండ్రుపట్ల గ్రామాల్లో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు అలానే మధ్యాహ్నం కొత్తగూడెం, జూలూరుపాడు మండలాల్లో పర్యటించి స్థానికంగా ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. 20వ తేదీన మధిర మండలంలోని పలు గ్రామాల్లో జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు తో కలసి ఎంపీ నామ పర్యటిస్తారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఎంపీ క్యాంప్ ఆఫీస్ కోరింది.

